# అవినీతి పరులకు శుభవార్త



## పాపం అవినీతి పరులంతా అమాయకులే !

జ్యోతిషరత్న


**చండిక సాంబశివరావు**

M.A. Litt., M.A. Astrology

NIYA AND NIHAL PUBLICATIONS

# కనకదుర్గ అమ్మవారు

## విజయవాడ



# అవినీతిపరులకు శుభవార్త

## (అవినీతిపరులందరూ అమాయకులే!)

జ్యోతిషరత్న

**చండిక సాంబశివరావు**

M.A. Litt., M.A. Astrology

**నియా అండ్ నిహాల్ పబ్లికేషన్స్**

ఉండవల్లి సెంటర్, తాడేపల్లి మండలం,

గుంటూరు – 522 501

సెల్ నెం.: + 91 7893930585

ప్రథమ ముద్రణ : అక్టోబరు, 2017

ప్రతుల సంఖ్య : 1000

ప్రచురణ : నియా అండ్ నిహాల్ పబ్లికేషన్స్

© శ్రీ చండిక సాంబశివరావు

**వెల : రూ. 60/-**

ప్రతుల కొఱకు :

**నియా అండ్ నిహాల్ పబ్లికేషన్స్**

ఉండవల్లి సెంటర్, తాడేపల్లి మండలం,

గుంటూరు - 522 501

సెల్ నెం.: + **91 7893930585**

ముద్రణ : కృష్ణ ప్రింటర్స్, Hyderabad, Mobile : 9246503757

# అర్పణ



**జనులంతా కర్మ సిద్ధాంతం గురించి తెలుసుకుని**

**ఆనందప్రదమైన జీవితాలను అందరూ పొందాలని ఆ**

**తిరుమల తిరుపతి**

**శ్రీ వేంకటేశ్వరుని**

**భక్తితో ప్రార్థిస్తూ....**

☆★☆★☆★☆★☆

మంచి ఆలోచనలు చేసేవారికి
అన్నీ శుభాలే జరుగుతాయి

☆★☆★☆★☆★☆

# విషయసూచిక


| క్రమ సంఖ్య | విషయము | పేజీ సంఖ్య |
|---|---|---|
| 1. | అవినీతిపరులకు శుభవార్త | 1 |
| 2. | శుభాకాంక్షలు | 15 |
| 3. | విమర్శ | 23 |
| 4. | ముఖ్యమంత్రి గారికి విజ్ఞప్తి | 29 |



**ఆశ దుఃఖానికి హేతువు అవుతుంది**

**ఆశ నుండి విముక్తి పొందితే, దుఃఖం అంతమవుతుంది**

గౌతమ బుద్ధుడు

# అవినీతిపరులకు శుభవార్త

(పాపం అవినీతిపరులంతా అమాయకులే!)

**అవినీతిపరులకు** ఇది నిజంగా శుభవార్తే, అయితే ఈ పుస్తకం చివరి వరకు చదివితేగాని ఈ విషయం అర్ధంకాదు. అలాగని ఈ పుస్తకం టైటిల్ లేదా ఇందులో చెప్పబడిన అంశాలు మిస్‌గైడ్ చేసేవి కాదని, గైడ్ చేసే కీలక విషయాలు మాత్రమే ఉన్నాయని పాఠకులకు మనవి చేస్తున్నాను. గత 30 సంవత్సరాలుగా జ్యోతిషం, కర్మ సిద్ధాంతం అధ్యయనం చేశాను. ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి నిరుత్సాహ పడకుండా, లౌకిక జీవితంలో అభివృద్ధికి ఉపయోగపడనప్పటికీ వ్యక్తిగత ఆసక్తిమేరకు ఈ అధ్యయనాన్ని ఇప్పటి వరకు కొనసాగిస్తూనే ఉన్నాను. ప్రయోగంతో గూడిన అధ్యయనం కాబట్టి కొన్ని ఫలితాలు వచ్చాయి. ఈ ఫలితాలను కూడా ఎంతో ఓర్పుగా పరిశీలించటం జరిగింది. ఈ పరిశీలన గంటలు, రోజులు గాక ఏళ్ల తరబడి చేశాను. ఆ విధంగా అనేక పరీక్షలకు రాటుదేలి నిలబడిన నికర ఫలితాలను మాత్రమే నేడు నల్గురికీ పుస్తకాల ద్వారా వీడియోల ద్వారా చెప్పటం ప్రారంభించాను. నిజానికి నేను తెలుసుకున్నది కొత్త విషయం ఏమీ కాదు. ప్రకృతిలో లేనిదంటూ ఏమీలేదు. మనమంతా ఈ విశ్వంలో భాగమే కావున ఎప్పుడైనా ఎక్కడైనా ఆ కాలానికి అవసరమైన విషయాలను అవసరమైనంతమేరకు విశ్వమే అందుకు తగిన మనుషులను ఎన్నుకుని వారిద్వారా అందిస్తుంది. మీకు తేల్చి చెప్పాలంటే చాలామంది అహంకారంతో మనిషిని గొప్పవాడిగా ఆవిష్కరిస్తూ మనిషి చంద్రమండలం వెళ్లాడనీ, టెలిఫోన్, టెలివిజన్, విమానం, కరెంటు, కంప్యూటర్, రోబో లాంటి వస్తువులను ఏకరవుపెడ్తూ ఇవన్నీ సాధించాక ఇంకా కర్మ సిద్ధాంతం, జ్యోతిషం అనటం మూఢనమ్మకం గాక మరేమిటి అంటారు.

# అవినీతిపరులకు శుభవార్త

పాఠకులారా అసలు విషయం ఏమిటంటే మనకు గాలి, నీరు, ఆహారం ఈ విశ్వం ఇచ్చింది. అదేవిధంగా ఎడిసన్ ద్వారా బల్బు, మార్కొని ద్వారా రేడియో, రైట్సు సోదరుల ద్వారా విమానం, గ్రహంబెల్ ద్వారా టెలిఫోన్ "విశ్వమే" అందించింది. శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారిని ముఖ్యమంత్రిగా కూర్చోబెట్టినా, శ్రీ నరెంద్ర మోడి గారిని ప్రధానమంత్రిగా కూర్చోబెట్టినా మొత్తం ఈ విశ్వమే చేస్తుంది. ఇదంతా కర్మ సిద్ధాంతంలోని అంతర్భాగమే. మనందరం జన్మించకముందు ఎన్నో వేల సంవత్సరాలకు పూర్వమే "కర్మ సిద్ధాంతం" ప్రాచుర్యంలోకి వచ్చింది. ఎవరికి నచ్చినా నచ్చకపోయినా, ఎవరు నమ్మినా నమ్మకపోయినా కర్మ సిద్ధాంతం సత్యమైనది. ఒక విద్యార్థి ఏదైనా ఒక అంశంలో మాస్టర్ డిగ్రీ తీసుకోవాలంటే ప్రాథమిక విద్యనుండి లెక్కించితే మొత్తం 16 నుండి 18 సంవత్సారలు పడ్తుంది. సాదారణ సర్టిఫికెట్ స్థాయి కోర్సు పూర్తి కావలన్నా కనీసం 12 సంవత్సరాలు పడ్తుంది. అప్పుడు కూడా ఆ విషయంలో సంపూర్ణత లేదా పరిపూర్ణత వచ్చినట్లు ఏమీ కాదు. కేవలం సంతృప్తికరంగా ఆ విషయం అర్థమైనట్లుగా మనం భావించాలి. ఆ తర్వాత అంచలంచలుగా జ్ఞానతృష్ణ ఉన్నవారు చివరివరకు తమ అధ్యయనాన్ని కొనసాగిస్తూ సాటి మనషులకు ఉపయోగపడుతున్నారు.

జ్ఞానం అనేమాట విశ్వమంత పెద్దదైనప్పటికీ ఇది అర్థం కావటానికి అవసరమైన ప్రాథమిక పరిజ్ఞానం అందించగల మాధ్యమం కర్మ సిద్ధాంతం మాత్రమే. ఇది ఎంతో విశిష్టమైనదే గాక సులభంగా అర్థం చేసుకుని అంగీకరించి ఆచరించటానికి అనువైనది కూడా !

"కర్మ సిద్ధాంతం" గురించి అనేక మంది పుణ్య పురుషులు వివిధ గ్రంధాలలో తెలియజేసినప్పటికీ, ఆ సారాంశం కాల్పనిక సాహిత్యం లాగా

అందరినీ ఆకట్టుకోలేక పోయింది. ఫలితంగా భారతీయులందరూ నెత్తిన పెట్టుకుని పూజించాల్సిన ఈ సిద్ధాంతం ఒక వర్గం లేదా మతం యొక్క నమ్మకం స్థాయిలోనే ఉండిపోయింది. నిజానికి సర్వమత సారాంశం ఒక్కటే! పాత్రలు, కథనాలు, ప్రదేశాలు వేరయినప్పటికీ అంతిమంగా అందరూ చెప్పేది ఒక్కటే; మంచికి మర్యాద, చెడుకు శిక్ష. నిప్పు పట్టుకోవడం కారణమయితే, చేయి కాలటం కార్యం లేదా పరిణామం. కార్యాకారణ సంబంధం వివరించేది కర్మ సిద్ధాంతం.

ఇప్పుడు కర్మ సిద్ధాంతం గురించి తెలియకపోతే వచ్చిన నష్టం ఏముంది? నాలుగు డబ్బులు సంపాదించటం ముఖ్యం కదా అని మీరు ప్రశ్నించవచ్చును.

డబ్బు ఆవశ్యకత, ప్రాముఖ్యత గురించి చిన్న పిల్లలకు కూడా తెలుసు. ఎందుకంటే పెద్దవాళ్లం మనకు తెలుసు కాబట్టి మన నుండి పిల్లలు పెరుగుతూ అంచలంచలుగా నేర్చుకుంటారు. కాని కర్మజ్ఞానం మనకే తెలియనప్పుడు పిల్లలకు ఎలా నేర్పించగలం? డబ్బు ఒక్కటే ఉంటే చాలని మనం ఊరుకోవటంలేదు కదా! పిల్లలకు నడక, మాటలు నేర్పించటంతోపాటు, మల మూత్ర విసర్జన, స్నానం, దుస్తులు ధరించటం లాంటి కీలకమైన విషయాలు నేర్పిస్తున్నాము కదా! ఇదిగో ఇలా పుట్టిన ప్రతీ శిషువు దైనందిన జీవితంలో స్వీయ పరిశుభ్రత గురించిన అలవాట్లు ఏ విధంగా తల్లిదండ్రుల నుండి నేర్చుకుంటున్నారో, "కర్మ సిద్ధాంతం" గురించి కూడా అలాగే నేర్చుకోవాలి. అలా పెద్దల నుండి పరంపరగా నేర్చుకోవాలంటే నేటి తరానికి కర్మ సిద్ధాంతం గురించిన అవగాహన, ఉపయోగం కశ్చితంగా తెలిసి ఉండాలి. మన జీవితంలో జరిగే ప్రతి సంఘటన సమస్త మానవ సంబంధాలు "కర్మ సిద్ధాంతం" పరిధిలోకే వస్తాయి.

# అవినీతిపరులకు శుభవార్త

ఏదైనా తెలియని వారినే గదా పాపం అమాయకులు అని అంటాము. ఆ విధంగా చూస్తే అవినీతిపరులంతా అమాయకులే గదా! ఎందుకంటే తప్పు చేసిన వారు తాత్కాలికంగా చట్టం నుండి శిక్ష తప్పించుకోగల్గినా, ప్రాకృతిక ధర్మం కర్మ సిద్ధాంతం నుండి ఎట్టి పరిస్థితులలోనూ తప్పించుకోలేరు, ఏదో ఒక రోజు తప్పని సరిగా శిక్షింపబడతారు అనే విషయం వారికి తెలియకపోబట్టే గదా, వందల కోట్లకు అవినీతికి పాల్పడుతున్నారు. ఇప్పుడు ఈ పుస్తకం ద్వారా ఋజువులు, సాక్ష్యాలతో సహా "కర్మ సిద్ధాంతం" ఎంతటి బలమైనదో తెలియజెప్పాలని నా ఆకాంక్ష.

కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి ఎన్నికలలో గెలవడం, ఆ తర్వాత కోట్లాది రూపాయలు ప్రజాధనం దండుకోవడం ఇదొక విషవలయం. నాయకులను చూసి ప్రభుత్వ ఉద్యోగులు కూడా అవినీతికి పాల్పడుతున్నారు. కుటుంబ అవసరాలకో, వైద్య అవసరాలకో వేలల్లో అవినీతికి పాల్పడటం వేరు. ఒక ప్రభుత్వ ఉద్యోగి వందలకోట్లు ప్రజాధనం కొల్లగొట్టటం ఏమిటి? అవినీతి నిర్మూలనకు చిత్తశుద్ధిగా ఏ ప్రభుత్వం ప్రయత్నించింది? పూర్తిగా విశాల భావాలతో గూడిన ప్రజా శ్రేయస్సు మాత్రమే కోరుతూ ప్రజల సొమ్ము ముట్టుకోకూడదు అనుకునే వారు లేరని మనం అనలేముగాని, అన్ని నియోజక వర్గాలకు సరిపోయినంత మంది అభ్యర్థులున్నారా? ఒకవేళ ఏదో విధంగా అలాంటి వారిని గుర్తించినా, అలాంటి వారిని గెలిపించుకోగల సత్తా ఈ దేశంలో ఏ పార్టీకి అయినా ఉందా? ఉంటే మంచి చెడులతో గూడిన ఒక మిశ్రమ ప్రభుత్వం మాత్రమే మనం ఏర్పాటు చేసుకోగలం. స్వార్థం, అవినీతి, ఉదాశీనత, ప్రతికూల భావనలు ప్రజలలోనే ఉన్నప్పుడు సహజంగానే అవినీతి పరులైన నాయకులకు వీరు కనెక్టవుతారు. అంటే ఒక నియోజక వర్గానికి

ఎం.ఎల్. ఏ గా ఎన్నిక కావాలంటే పది కోట్లు ఖర్చు పెట్టాల్సి ఉంటుందని బహిరంగంగా అందరూ అంగీకరిస్తుంటే, ఇక అవినీతిని నిర్మూలించే దెప్పుడు? ఆ నిర్మూలనకు చిత్త శుద్ధితో గూడిన ప్రయత్నాలు జరిగేదెప్పుడు?

ఈ లోగా అనేక అనర్థాలు నిరంతరం జరుగుతూనే ఉంటాయి. పాపం అమాయకులైన అవినీతి ప్రభుత్వ ఉద్యోగులు ఉద్యోగాలూడ గొట్టుకుని, ఇంటా బయట అప్రతిష్టపాలై అవినీతి అనకొండ, పెద్ద తిమింగలం, భూ బకాసురుడు లాంటి చిత్ర విచిత్రమైన బిరుదులను టీ.వీ చానల్సు వారి ప్రసారాలలో ప్రకటిస్తుంటే, మానిసిక సంఘర్షణకు గురవుతూ దాచుకున్న డబ్బంతా అవినీతి నిరోదక శాఖ అధికారులు మూట గట్టుకుని వెళ్తుంటే, తన పంచ ప్రాణాలను యముడు పాశం వేసి లాక్కెళ్తున్నట్లుండే సంఘటన ప్రత్యక్షంగా చూస్తూ నరకం అనుభవిస్తున్నారు. అవినీతి పరులైన ప్రభుత్వ ఉద్యోగులను నేను సమర్థిస్తున్నట్లుగా పొరపాటుగా అర్థం చేసుకోవద్దు.

కర్మ సిద్ధాంతం గురించి తెలియకపోబట్టే కదా, వీరికి ఈ కష్టాలు - అని చెప్పటమే నా ఉద్దేశం. ఇప్పటికే అరెస్టయి కేసులు కోర్టులో ఉన్నవారి గురించి మనం వ్యాఖ్యానించటానికి నిబంధనలు ఒప్పుకోవు గావున మన రాష్ట్రంలో ఉన్న పట్టుబడని అవినీతి పరులందరూ, భవిష్యత్తులో భయపడకుండా సంతోషంగా ఉండాలంటే ఏం చేయాలన్నదే **శుభవార్త.**

కర్మ సిద్ధాంతం యొక్క విస్తృత ప్రయోజనాలు అందరికీ ఎఱుక పరచాలని, "మన జీవిత కథ మనం రాసుకున్నదే!" అనే విశ్వాసం ప్రబలంగా కల్గించటానికి ఈ పుస్తకం రాశాను. మనందరి నమ్మకాలు, అభిప్రాయాలు పరిణితి చెందాక హృదయం విశాలమయ్యేసరికి ఆలోచనా విధానమే సంపూర్ణంగా మారిపోతుంది. భావాలు స్వఛ్ఛంగా తాజాగా సువాసనలు విరజిమ్ముతూ ఆవిర్భవిస్తాయి. పాపభీతి పెరిగి అందరూ ధర్మంగా నడుచుకోవటం వలన సమాజమే పెద్ద సత్సంఘంగా తయారయి, ఆకలి,

అలజడి, దోపిడి, దౌర్జన్యం లాంటి సామాజిక రుగ్మతలు రూపు మాసిపోయి ఏదో ఒక నాటికి భారత దేశమంతా వసుదైక కుటుంబంగా ఆవిర్భ విస్తుంది. ఇదే కొత్త బంగారు లోకం.

ఇది అసలు జరిగే పనేనా - అని మీలో కొంతమంది పెదవి విరవచ్చు. కాని ఈ పుస్తకం ద్వారా నేను చెప్పదల్చుకున్న దాంట్లో ఇదే కీలక విషయం. దృక్పథం మారితే దానికి తగినట్లుగా మొత్త మారిపోవటం ఈ విశ్వంలో ఉన్న కీలక విషయం. అప్పుడు చెట్టు, పుట్ట, పిట్ట, కట్టె అన్నీ కూడా తమ భాషలో ఎన్నో విషయాలు నిశ్శబ్ధంగా చెబుతూనే ఉంటాయి. మారిన మనస్సుకు ప్రకృతి భాష తెలుస్తూనే ఉంటుంది. దారిన పోతుంటే చెవినబడే సంభాషణలో కూడా కొత్త అర్ధాలు స్ఫురిస్తాయి. రోజూ సాధారణంగా కనిపించే మనషులలో కూడా అసాధారణ విషయాలు వెల్లడవుతాయి.

భావాలకు పరిశుద్ధత తోడైతే సంపూర్ణానందానికి తలుపులు తెరుచుకుంటాయి. ***సత్కర్మలు ఆచరించే సాత్వికులకు ఈ ప్రపంచం ఎల్లప్పుడూ "కొత్తబంగారు లోకం" గానే ఉంటుంది. పరిణామ క్రమంలో జరిగేది జరుగుతూనే ఉంటుంది. ఇదే విశ్వ రహస్యం. అంతేగాని గ్రాఫిక్ మాయాజాలంలా ఇప్పుడున్న లోకం మంత్రించినట్లు మాయమై హఠాత్తుగా బంగారు లోకం సృష్టింపబడదు.***

అవినీతి నిర్మూలన సాధ్యమే. దీనికి ఒకే ఒక శాశ్వతపరిష్కారం "కర్మ సిద్దాంత ప్రచారం". తప్పు చేసిన వ్యక్తి చట్టం నుండి తప్పించుకోవచ్చునేమో గాని ప్రాకృతిక ధర్మం నుండి తప్పించుకునే చాన్సు ఎవ్వరికీ లేదు. కర్మ సిద్దాంతాన్ని ఋజువులతో, సాక్ష్యాలతో ప్రచారంలోకి తీసుకువెళితే ఖఛ్చితంగా "పాపభీతి" పెరిగి అవినీతి ఒక్కటే కాదు అన్ని

అవలక్షణాలు అదుపులోకి వస్తాయి.

ఎక్కడైనా బలవంతుడిదే పైచేయి. అది బలం వలన గావచ్చు, డబ్బు వలన గావచ్చు, అధికారం వలన గావచ్చు, పాండిత్యం వలన గావచ్చు. పాప పుణ్యాలు, కర్మ లాంటివి నిజం కాదు. ఇవన్ని చేతగాని మాటలని లోకంలో చాలామంది అనుకుంటున్నారు. దీనికి తగిన సమాధానం చెప్పి మీ అందరి సందేహ నివృత్తి చేయవలసిన బాధ్యత నా మీద ఉంది. కర్మ సిద్ధాంతం ఎంత బలంగా పని చేస్తుందో మనం మాట్లాడకుందాం. కొట్టిన వాడు కొట్టబడతాడు. తిట్టిన వాడు తిట్టబడతాడు. అవమానించిన వాడు అవమానింపబడతాడు. మోసం చేసిన వాడు మోసగింప బడతాడు. ఇది ప్రకృతిలో ఉన్న చర్య-ప్రతిచర్య సూత్రం. విశ్వంలో సూర్యాది నవగ్రహాలు, భూమి నిరంతరం ఒక నియమం ప్రకారం ఏ విధంగా సంచరిస్తున్నాయో అదేవిధంగా కర్మ సిద్ధాంతం కూడా ఒక నియమం. ఈ విషయాలకు మీ అనుభవమే ప్రమాణము. ఇతరుల అనుభవాన్ని మీరు నమ్మనవసరం లేదు.

బలవంతుడిదే పై చేయి అంటారు. ఎవడు బలవంతుడు? సినిమాలలో హీరో నడి బజార్లో అందరినీ కొట్టి ఇంటికి వచ్చి నిశ్చింతగా నిదురపోతాడు. నిజ జీవితంలో మీరు గాని, మరొకరు గాని, ఎందుకోసమైనా గాని ఎవరినైనా కొట్టి ఆదమరచి నిదురపోగల సదుపాయం ఉందా? భయంతో ఎక్కడో ఒకచోట దాక్కోవటమో, మరో నలుగురిని వెంటవేసుకుని అనుక్షణం అభద్రతతో సంచరించటమో చేస్తారు. భయపడేవాడు బలవంతుడేలా అవుతాడు? రాజకీయపదవులలో ఉన్న అనేక మంది నోరుపారేసుకున్న మరుక్షణమే ప్రత్యర్థులు వారిపై ఎదురు దాడి చేసి అంతకు పదింతలు తిట్టడం కూడా మీరు టీ.వీ. లలో చూస్తున్నారుగా. ఇలా తిట్టి తిట్టించు కోవడం, సంఘర్షణకు గురవటం, ఉత్పాదక కాలం

నిరుపయోగంగా వెచ్చించటం పై చేయి ఎలా అవుతుంది?

కట్టు దిట్టమైన భద్రతా వలయంలో సురక్షితంగా ఉండే మన ముఖ్యమంత్రి మీద గతంలో హత్యా ప్రయత్నం ఎలా జరిగింది? పురుచ్చి తలైవి బిరుదాంకితురాలు తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జైలుపాలు ఎలా అయింది? డబ్బు అధికారం ఉన్న ఎం. ఎల్. ఏ స్టాంపు కుంభకోణంలో నిందుతుడిగా ఎలా పట్టుబడ్డాడు? ప్రస్తుత ప్రతిపక్ష నేత ఎంతో అంగబలం, అర్ధబలం ఉండి కూడా కొంతకాలం ఎందుకు జైలులో ఉండవలసి వచ్చింది? కులం దే పై చేయి అనుకుంటే, నిందితులుగా కేసులు ఎదుర్కొంటున్న అనేక మందిని సాటి కులస్థులు ఎందుకు రక్షించటం లేదు? ఇలా చెప్పుకుంటూ పోతే ఈ ఉదాహరణలతోనే మొత్తం ఈ పుస్తకం నిండిపోతుంది.

తెల్లవారి లేస్తే ఎన్ని ఉదంతాలు మీకు కన్పించటంలేదు? సమాజంలో సాంఘీక కట్టుబాట్లు ఉన్నాయని, వీటికి అతీతంగా "వ్యక్తి" ఎప్పుడూ ఏ విధంగానూ బలవంతుడు కాదని మీరు తెలుసుకోవాలి.

విశ్వంలో భూమి పరిమాణం ఎంత? భూమ్మీద మనదేశం, అందులో మన రాష్ట్రం, మన జిల్లా, మన ఊరు, మన ఇల్లు ఎంత, ఎంత, ఎంత? ఇంట్లో ఒక ఆరడుగుల ఆకారం మనది. ఇప్పటికి లక్షల కోట్ల మనషులు మరణించారు. వారు ఇక్కడ కొంతకాలం ఉన్న ఆనవాళ్లు కూడా లేవు. టి. వి. చూస్తుంటే తెలిసిపోతుంది. నిర్విరామంగా మరణవార్తలు. నిన్న ఈ సమయంలో కూడా వారున్నారు. కొంతమంది గంట క్రితం వరకు కూడా సజీవంగా ఉన్నారు? మర్నాడు తాము ఉండబోమని వాళ్లు అనుకున్నారా? ఏదో ఒకరోజు మన వంతూ వస్తుంది. ఇల్లు, కారు, బ్యాంకు బాలన్సు, బంధాలు-అనుబంధాలు అన్నీ వదిలి

పోవలసిందే. ఒంటరిగా వచ్చి ఒంటరిగా ఈ లోకం నుండి నిష్క్రమించే మనకు పై చేయి గొడవ ఎందుకు?

మనందరం దేవుని బిడ్డలం అంటుంది క్రైస్తవ మతం. పరమాత్మలో ఉన్న అంశ మానవులందరిలో ఉందని హిందూమతం చెబుతుంది. ఇంచుమించుగా మనకు తెలిసిన అన్ని మతాలు ఈ అంశాన్ని బలపరుస్తున్నాయి.

ఈ పుస్తకం చదివాక మీరు కొత్త అనుభూతికి లోనవుతారు. గతంలో చాలాసార్లు ఏదో ఒక విషయం గురించి మీ మనస్సు సంఘర్షణపడి ఉండవచ్చును. పలు పర్యాయాలు ఇతరులపట్ల అసంతృప్తితో దిగులుపడి ఉండవచ్చును. ఏదో చెప్పుకోలేని బాధలు, సందర్భాలు ఏమైనా ఉండి ఉంటాయి. ఇప్పుడిక అంతా సంతోషమే. ఎందుకంటే సుఖదు:ఖాల మర్మం ఏమిటో అసలు రహస్యం కర్మ సిద్ధాంతమేనని మీరు తెలుసుకుంటారు.

చేసుకున్నవారికి చేసుకున్నంత అనే నానుడి ప్రారబ్ధకర్మను అనుసరించి అభివృద్ధి చెంది వాడుకలోకి వచ్చిన లోకోక్తి. అందువలన వేలకోట్ల మానవులున్నప్పటికీ జీవన ప్రమాణాలలో ఆర్థిక పరిస్థితులలో ప్రారబ్ధ కర్మ కారణంగా ఏ ఇద్దరి జీవితమూ ఒక్కలా ఉండదు. కంటికి కన్పించే సమస్త ప్రాపంచిక ఐశ్వర్యాల వెనక పరోక్షంగా ఉన్న అంశము ధర్మమే!

మీరు ఈనాడు చూస్తున్న ప్రముఖులంతా ఒకనాడు సామాన్య కుటుంబాలలో జన్మించిన వారే! వారి వారి గత జన్మల పాపపుణ్యాల ననుసరించి, ప్రస్తుతం ఫ్రీవిల్‌తో వారు చేస్తున్న ఆగామి కర్మలను అనుసరించి వారి సంతోష దు:ఖాలు, అభివృద్ధి, విజయాలుంటాయి.

వారి క్రియలన్నింటి వెనుక వారి యొక్క "సంకల్పం" ఉంటుంది. లక్ష్యం ఉంటుంది. విశ్వం మనందరి అర్హతలను నిర్ణయిస్తుంది. తన గురించి ఇతరులు ఏమనుకుంటున్నారనే ఆలోచనా విధానంలో జీవిస్తూ, అనుక్షణం పోల్చుకుంటూ బ్రతికే వారికి ఎన్నటికీ మన:శాంతి ఉండదు. సైకాలజీస్టులు "కండీషన్డ్ మైండ్" అన్నా ఆధ్యాత్మికతలో బంధం అన్నా ఇదే. ఇలాంటివారు ఎల్లకాలం తీవ్రమైన ఉద్వేగాలకు గురవుతూ పక్కనున్నవారిని ఆ రొంపిలోకి లాగుతుంటారు. ప్రవచనాలకు వెళ్లినా, ప్రార్థనలు చేసినా వీరిదంతా డాంభికమే! వీరంతా బలహీనులే.

తనను తాను తెలుసుకుని నిరంతరం ఆత్మ పరిశీలన చేసుకుంటూ, తన పరిమితులను అర్థం చేసుకుని, వివేకం, మానవత్వం, దయ, కరుణ, క్షమ, ప్రేమ మొదలైన సాత్విక లక్షణాలతో జీవించే వారంతా బలవంతులే.

ఇక ఇప్పుడు అవినీతిపరుల గురించి మాట్లాడుకుందాం. పాఠకులారా! దయచేసి చదవండి. వందల కోట్లు అవినీతికి పాల్పడే వారంతా రాజకీయ నాయకులు గావచ్చు, ప్రభుత్వ ఉద్యోగులు గావచ్చును. కాని వారంతా యోగజాతకులు మరియు ఉన్నతమైన పరిణితి చెందిన వారిగా నేను అభిప్రాయపడుతున్నాను. ఎందుకంటే పార్టీ కార్యకర్తలకు, ప్రభుత్వ శాఖలలోగల చిరు ఉద్యోగులకు వందల కోట్లు అవినీతికి పాల్పడే అవకాశం ఉండదు. బారీ ఎత్తున అవినీతికి, అవకతవకలకు పాల్పడే అవకాశం కేవలం ప్రభుత్వ ఉన్నతాదికారులకు, రాజాకీయాలలో ఉన్నత హోదాలో ఉన్న వారికే సుసాధ్యం. ప్రభుత్వంలో ఉన్నతాధికారంటే మంచి జీతం, రిటైర్మెంటు వరకు ఉద్యోగ భద్రత, జీతాలు, ఇంక్రిమెంట్లు, వాహన సౌకర్యం, ఇంటా బయట గౌరవం.... ఒకరకంగా చెప్పాలంటే వ్యాపారంలో ఒడిదుడుకులున్నట్లుగా, ప్రైవేటు ఉద్యోగాలలో టార్గెటు వత్తిడి

ఉన్నట్లుగా, ప్రభుత్వ ఉన్నతాధికారులకు ఈ ఇబ్బందులేమీ ఉండవు. పాడికుండలాంటి ఉద్యోగం అందరికీ ఈ అవకాశం ఉండదు గావున వీరంతా యోగజాతకులే! ఆ విధంగానే ఏ పార్టీనుండి ఎన్నికైనా సరే, ఎం.ఎల్. ఏ. గా ఎన్నికైన వారంతా యోగజాతకులే. వీరిలో మంత్రి పదవి వచ్చిన వారు మరింత యోగం ఉన్నవారని అర్థం. ***వారికి కేటాయించబడిన భాధ్యతలు నిర్వర్తిస్తూ కుటుంబంతో, అన్ని సౌకర్యాలతో ఆనందంగా జీవించవలసి ఉండగా, వందలకోట్లు అవినీతికి పాల్పడి కష్టాలు కోరి తెచ్చుకుంటున్నారంటే, వారి యోగాన్ని వారే పాడుచేసుకుంటున్నారని భావం.*** ఇతరుల వైభోగం చూసి అసూయపడకూడదని అందరూ చెబుతారు. కాని అర్హతను మించి ప్రజాధనంతో వైభోగంగా జీవించటం వలన చూసేవారి అసూాల క్రోధాలకు గురికావలసి ఉంటుంది. ఆర్థిక అసమానతల వలన అరాచకం పెరుగుతుంది. సాదారణంగా కర్మ సిద్ధాంతం ప్రకారం పాపాలు చేస్తే శిక్షలుంటాయని చాలా మందికి తెలుసు. కాని అందరూ అనుకునేదేమంటే కేవలం హత్యలు, మాన భంగాలు మత్రమే పెద్ద పాపాలని, వారు మాత్రమే నరరూప రాక్షసులని, అవినీతికి పాల్పడటం పెద్దపాపం కాదని అపోహపడుతుంటారు. అవకాశం వచ్చింది, సంపాదించుకుంటున్నామని, ఇదంతా పెద్దనేరం కాదని వారంతా భ్రమపడుతుంటారు.

ఒక ప్రభుత్వ ఉన్నతాధికారి రోడ్లు నిర్మించే కాంట్రాక్టర్ వద్దనుండి కమీషన్లు తీసుకుంటే ఏం జరుగుతుందో మీరు వివరంగా తెలుసుకోవాలి. ఉన్నతాధికారికి పర్సెంటేజీ ఇచ్చినందువలన కాంట్రాక్టర్ రోడ్డుకు ఉపయోగించే మెటీరియల్ నాణ్యమైనది వాడకుండా నాసిరకం వాడతాడు. పర్యవసానంగా రోడ్డులో నాణ్యత లోపించి, మొదటి వర్షానికే రోడ్డుమీద కంకర కొట్టుకునిపోయి పెద్ద పెద్ద గుంటలు ఏర్పడతాయి. ఆ తర్వాత

వేగంగా వచ్చే భారీ వాహనాలు ఆ గుంటలలో పడి ప్రమాదాలకు గురవుతాయి. అనేకమంది మరణించటమేగాక వందలాది మంది గాయపడ్తారు. ఈ మొత్తం మరణాలకు కమీషన్ తీసుకున్న ప్రభుత్వాధికారే కారణమవుతాడు. అందువలన ఇతను ప్రత్యక్ష హంతకుడుగాకున్నా, పరోక్షంగా అనేక హత్యలకు కారణమయ్యాడు గావున పాప ఫలితం అనుభవించాల్సి ఉంటుంది. చాలా మంది అవినీతి పరులు చట్టం దృష్టిలో పడకుండా ఉంటే చాలనుకుంటారు. తమ అవినీతి సంపాదనలో కొంత భాగం ఎంక్వైరీ అధికారులకు ముట్టజెప్పి, తన పాపపు సంపాదన ఉంచుకోవాలనుకుంటారు. ఉద్యోగ విరమణలోగా పట్టుబడకపోతే ఇక పర్వాలేదనుకుంటారు. కాని ఉద్యోగం వదిలేసాకే కాదు ప్రాణం వదిలేసాకైనా అవినీతికి పాల్పడిన వారు ఎవరైనా, ఎంతటి వారైనా, ఆడ, మగ అనే తేడా లేకుండా శిక్ష అనుభవించాల్సి ఉంటుంది. అంతేకాదు ఆ పాపం అంతటితో పోకుండా వారి కుటుంబాన్ని పట్టి పీడిస్తుంది. ఒక్క ముక్కలో చెప్పాలంటే అవినీతిపరుల వలన జరిగిన పరిణామాలన్ని లెక్కలోకి వస్తాయి. ఇల్లు అలకగానే పండుగ కాదు. ఏ రోజు ఏం జరుగుతందో ఎవ్వరం చెప్పలేము. కాని అవినీతి పరులు కశ్చితంగా శిక్షింపబడతారు.

అవినీతిపరులకు నేను చెప్పగల శుభవార్త ఏమంటే మీరు ఇప్పటి వరకు అవినీతి నిరోదక శాఖ వారికి లేదా సి.బి.ఐ. వారికి పట్టుబడలేదని ఉపేక్షించవద్దు. కర్మ సిద్ధాంతం ప్రకారం చర్యకు ప్రతిచర్య ఉంటుంది.

ఇటీవల టీ.వీ.లలో చూసాను. మన రాష్ట్రంలో అవినీతి నిరోదక శాఖ వారికి పట్టుబడిన ఒక ప్రభుత్వ అధికారి వద్ద 500 కోట్లు అవినీతి సొమ్ము దొరికిందట. మరొక ప్రభుత్వ అధికారి వద్ద 900 కోట్లు దొరికిందట. ఏమిటండీ ఇది? ఒకపక్క రాష్ట్రంలో నిధుల కొరత. రోజు

రోజుకూ రాష్ట్రం చెత్తకుండిలా మారిపోతుంది. 13 జిల్లాలలోనూ చెత్త డంపింగ్ యార్డ్‌ల కొరత కారణంగా, కాలవ గట్లను అనధికారిక డంపింగ్ యార్డులుగా వాడుతున్నారు. 500 కోట్లతో గార్బేజ్ కార్పోరేషన్ పెట్టి రాష్ట్రంలో చెత్త సమస్యను శాస్వతంగా పరిష్కరించవచ్చును. అవినీతిపరుల వలన రాష్ట్రాభివృద్ధి కుంటుపడుతుంది. ప్రస్తుతం సమాజంలో నెలకొన్న అలసత్వ పరిస్థితుల కారణంగా మీ అవినీతి సంపాదన ఇంకా పట్టుబడకపోవచ్చును. కాని కర్మ సిద్దాంత రీత్యా మీరు చేసిన తప్పునుండి మీరు ఎట్టి పరిస్థితులలోనూ తప్పించుకోలేరు. కావున జరిగిందేదో జరిగిపోయింది. జరగవలసింది చూద్దాము.

అవినీతి పరులందరూ మీకు నచ్చిన దేవుని సాక్షిగా మనసులోనే ప్రమాణం చేయండి. ***"ఈ రోజు నుండి ప్రజల సొమ్ము ఒక్క రూపాయి కూడా అవినీతిరూపంలో తీసుకోను. నా చివరి శ్వాసవరకు అవినీతికి పాల్పడను"*** అని ప్రమాణం చేసి మీరు ఇప్పటి వరకు చేసిన తప్పులను తలుచుకుని పశ్చాత్తాప పడండి. అంతే! మీ జీవితం అద్భుతంగా మారిపోతుంది. మీకు ప్రకృతి చట్టంనుండి రక్షణ లభిస్తుంది. మీరు ఇప్పటి వరకు సంపాదించిన సొమ్ము ఏమి చేయాలన్నది మరొకరు చెప్పేది కాదు. మీ అంతరాత్మ ప్రభోధం ప్రకారం మీరు నడుచుకుంటారు. నేను ముందే మనవి చేసినట్లుగా మీరు పరిణితి చెందినవారు. మీరు యోగజాతకులు. తెల్లటి బట్టమీద నల్లటి మరక లాగా మీకు ఈ అవినీతి మరక అంటుకుంది. మీకు అన్నీ తెలుసు మీకు ఏం తక్కువ. ఈ దేశంలోని కోటానుకోట్ల మనషులందరి కంటే మీరు అదృష్టవంతులు. మీ పిల్లలకు, పిల్లల పిల్లలకు మంచి విద్యాబుద్ధులు, చక్కని ఆరోగ్యం, చిరునవ్వులతో హాయిగా సాగిపోతున్న జీవితంలో అపశ్రుతిలా ఉన్న మీ అవినీతికి చరమగీతం పాడాలని మీకు లేదా? గతంగతహా. ప్రభుత్వ

అధికారులందరూ అవినీతి వదిలేస్తే మన రాష్ట్రానికి మహర్దశ పడుతుంది. ఈ కారణంగా గతంలో మీరు చేసిన తప్పులు కొంతవరకు క్షమింపబడతాయి. మీ కుటుంబాలకు శుభం చేకూరుతుంది. ఎంతో ప్రతిభ ఉండటం వలనే గదా మీరు ప్రభుత్వ అధికారి కాగలిగారు. మీకు తెలియని విషయాలు ఏముంటాయి? ఐన్‌స్టీన్ అంతటివాడికి ఆవకాయ పెట్టడం రాకపోవచ్చనే సామెతలాగా మీకు కర్మ సిద్ధాంతం గురించి తెలియకపోవచ్చును.

ఒకవేళ విని ఉన్నా లోతుగా తెలిసి ఉండకపోవచ్చును. లోతుగా కూడా తెలిసినా డబ్బు మీ అందరినీ ప్రలోభ పెట్టి ఉండవచ్చును. బంధువులు, స్నేహితులు, అందరికంటే నేను గొప్పవాడిని అనిపించుకోవటానికి తప్ప వందల కోట్లు ఏం చేసుకుంటారు? అయినా కోట్లాది మందికి తిండి, బట్ట, గూడు లాంటి కనీస అవసరాలు తీరకుండా కటిక దరిద్రం అనుభవిస్తూంటే, వారికి అందాల్సిన సంక్షేమ ఫలాలు మీరు లాక్కుని వందల కోట్ల అవినీతితో పోగేయ్యటం ఎంతవరకు సబబు?.

ఇది శుభారంభం. కర్మ సిద్ధాంతం గురించి మీరు తెలుసుకోండి. తెలియని వారికి తెలియజెప్పండి. అవినీతికి పాల్పడకండి. మీ జీవితాలను, మీ కుటుంబాలను రోడ్డుకీడ్చొద్దు. మీరు యోగ జాతకులు. అవినీతి సొమ్ము లేకుండానే మీరు ధనవంతులు, గుణవంతులు, భాగ్యవంతులు.

***మీ అందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసుకుంటున్నాను.***

# శుభాకాంక్షలు

ఈ వ్యాసం చదువుతున్న మీ అందరికీ నా హృదయపూర్వక **శుభాకాంక్షలు**.

సినిమావాళ్లకు, రాజకీయ నాయకులకు, క్రీడాకారులకు, జనం కనెక్టయినట్లే కొంతమంది స్వామీజీలకు, బాబాలకు, ప్రవచనాలు చెప్పే వాళ్లకు కూడా జనం కనెక్టవటం వలన ఆధ్యాత్మిక రంగం కూడా ప్రజాదరణ పొందిందే కాని, ప్రవచనాల సారాంశాన్ని తమ జీవనశైలిలో ఇముడ్చుకున్నవారు ఏ కొద్ది మంది మాత్రమే ఉంటారు. గత వంద సంవత్సరాలలో మనం సాంకేతికంగా అభివృద్ధి సాధించాము కాని, మమత, మానవత, జ్ఞానంలాంటి విషయాలలో పూర్తిగా వెనుకబడి పోయాము. అందువలనే ఆలయాలకు కులాలు ఆపాదించే అధమస్థాయికి దిగజారిపోయాము.

పెద్ద, చిన్న, ఆడ, మగ, అందరిలోనూ అహంకారాలు, డాబుసరి మాటలు, ఆత్మన్యూనతలూ ఎక్కువయ్యాయి. ముఖ్యంగా "నేను గొప్ప" అనే అంటువ్యాధి భారతదేశంలో బాగా ప్రబలిపోయింది. క్యాన్సర్, ఎయిడ్స్ కంటే అత్యంత ప్రమాదకరమైన ఈ వ్యాధిని ఎవరికి వారు కృషి చేసి సాధన ద్వారా తొలగించుకోవాలి.

ఇది తొలగించుకోవటానికే మన పూర్వీకులు ఈ భూమ్మీద నివశించే సమస్త మానవ జాతికి "శుభాకాంక్షలు" అనే అమృతతుల్యమైన ఔషదం ఇచ్చారు. అదే ఈ వ్యాసం ద్వారా నేను మీకు పరిచయం చేస్తున్నాను.

వేలాది గ్రంధాలు అధ్యయనం చేయటానికి ఒక జీవితకాలం సరిపోదు. బ్రతుకంతా అధ్యయనానికే సరిపోతే ఇక మనం బ్రతికేదెప్పుడు?

బ్రతుకులో అన్వయించుకునేదెప్పుడు? జ్ఞానాన్ని ఉపయోగించుకుని బ్రతుకును పండించుకునే దెప్పుడు? కాని "శుభాకాంక్షలు" దివ్యఔషధం ఈ విశ్వంలో ఉన్న జ్ఞానసంపద మొత్తాన్ని మీకు అందిస్తుంది. అంటే చదవకుండా ఎలా తెలుస్తుందని కదా మీ సందేహం.

అత్యంత మేధా సంపత్తి ఉన్న ప్రతిభావంతులకు కూడా "సకాలంలో సవ్యమైన ఆలోచన" స్ఫురణకు రావటం ద్వారా కదా జ్ఞానం ఉపయోగపడుతుంది. నాలుగు వేదాలు కూలంకషంగా చదివిన పండితునికి కూడా అవసరానికి స్ఫురణకు రానప్పుడు ఆ పాండిత్యం నిరర్ధకమే కదా! అంటే అవసరకాలంలో స్ఫురణకు రావటమే అంతులేని జ్ఞానవాహిని అంతిమ లక్ష్యంగా మీరు ఒప్పుకున్నట్లేగా!

ఇదిగో మీరేమీ చదవకుండా, మీకు ఎక్కడ అవసరమైతే అక్కడ, ఎంత అవసరమైతే అంత, ఎలా అవసరమైతే అలా, తగిన మోతాదులో "విశ్వమే" మీకు కన్న తండ్రిలా వెన్నంటి ఉండి "స్ఫురణ" రూపంలో మిమ్మల్ని తట్టి లేపుతుంది. ఒక పుస్తకం ద్వారా, లేదా దారిన వెళుతుంటే చెవినబడే సంభాషణ ద్వారా... ఏదో ఒక విధంగా విశ్వం మీకు ఏమి కావాలంటే అది ఈ విశ్వం ఎప్పటికప్పుడు తెలుసుకొని మరీ మీకు అందజేస్తుంది.

"శుభాకాంక్షలు" సాంప్రదాయం ప్రపంచమంతటా ఉంది. భాష, సంస్కృతి, జీవన విధానాలలో అనేక వ్యత్యాసాలు ఉన్నప్పటికీ అన్ని జాతులలోనూ, అన్ని మతాలలోనూ జీవితంలో ఎదురయ్యే ప్రతి సందర్భానికీ సాటి మనుష్యులకు "శుభాకాంక్షలు" చెప్పే ఆనవాయితీ ఉంది. "శుభాకాంక్షలు" యొక్క అంతర్యాన్ని సరికొత్త కోణంలో మీ మనస్సులో ఆవిష్కరించాలన్నదే నా ఆకాంక్ష.

# శుభాకాంక్షలు

పండుగలకు, పుట్టినరోజుకు, పెళ్లిరోజుకు, ఉద్యోగం వచ్చినప్పుడు, సంతానం కలిగినప్పుడు, ప్రమోషన్ వచ్చినప్పుడు, పరీక్ష పాసయినప్పుడు, కొత్తవ్యాపారం ప్రారంభించినప్పుడు, ఇంకా ఏదైనా కొత్తగా సాధించినప్పుడు... ఇలా అన్ని సందర్భాలలో మనమందరం ఒకరికొకరు "శుభాకాంక్షలు" చెప్పుకునే పద్ధతినే ఇప్పుడు మరింత పరిశుద్ధంగా ఆచరించటమే మనం చేయవలసింది.

**"హ్యాపీ న్యూ ఇయర్ టూ యూ...."**

**"ఆ... సేమ్ టూ యూ"** నాలుక మీద ఆ నాలుగు మాటలూ యాంత్రికంగా దొల్లించినంత మాత్రాన శుభాకాంక్షలు చెప్పినట్లా? ఒకసారి మనస్సుపెట్టి ఆలోచించండి. మిత్రుడు ముచ్చటగా మూడంతస్తుల మేడ నిర్మించుకుని గృహప్రవేశానికి పిలిస్తే హృదయపూర్వకంగా "శుభాకాంక్షలు" ఎంతమంది చెబుతున్నారు? పెళ్లికి వెళ్లిన ఆహ్వానితులు వధూవరులను హృదయపూర్వకంగా పదికాలాలపాటు పచ్చగా, సంతోషంగా ఉండమని ఒక నిమిషం పాటు నిలబడి అక్షింతలు వేసి ఆశీర్వదించి శుభాకాంక్షలు చెప్పలేనప్పుడు ఆ పెళ్లికి వెళ్లటం ఎందుకు? మీ తోబుట్టువులు, మీ బంధువులు, స్నేహితులు మీ కంటే ఉన్నత స్థితిలో ఉన్న సందర్భం చూసి హృదయపూర్వకంగా శుభాకాంక్షలు చెప్పగలుగుతున్నారా? అలా శుభాకాంక్షలు చెప్పగల్గితే అయినవాళ్ల మధ్య దూరాలు ఎందుకు పెరుగుతాయి? లేమి వాళ్ల వలన, వాళ్ల ఆత్మ న్యూనతల వలన సాధారణంగా అన్నదమ్ముల మధ్య, అక్క చెల్లెళ్ల మధ్య శృతి కుదరకుండా పోతుంది. "లేమి" అంటే డబ్బులో లేమి, విద్యలో లేమి, సాంఘీక హెూదాలో లేమి, సంతానయోగ్యతలో లేమి.... ఇలా అన్ని విధాలుగా తక్కువ స్థితిలో ఉన్నవారు తమ ఈర్ష్య, అసూయల కారణంగా అయినవాళ్లకు దూరం అవుతుంటారు.

# శుభాకాంక్షలు

ఎక్కడ చూసిన ఈర్ష్య అసూయలే అని అందరూ అంటారు. అందరితో పాటు మీరు, నేనూ కూడా అంటాము. కానీ మన అంతరాలలో వైరభావాలు లేకుండా వాటి గురించి ఎలా మాట్లాడగలం? మనకు వచ్చే వేలాది ఆలోచనలలో కొన్ని సానుకూలమైనవి, కొన్ని ప్రతికూలమైనవి ఉంటాయి. సత్వ, రజో, తమో గుణాల సమ్మిళితమైన ఈ విశ్వంలో ఏ ఒక్క వ్యక్తికి కూడా మొత్తం సానుకూల ఆలోచనలు మాత్రమే వచ్చే అవకాశం ఎంతమాత్రం లేదు. అందువలన ప్రతికూలభావాలైన ఈర్ష్య, అసూయ, అహంకారం, చిరాకు, పొగరు, దర్పం, క్రోధం, చపలత్వం, కపటం... లాంటి గురించి భయపడాల్సిందేమి లేదు గాని, వాటిని ఎప్పటికప్పుడు గమనిస్తూ, విచక్షణ అనే కత్తెరతో వాటిని కత్తిరిస్తుండాలి.

మీలోని ఈర్ష్య, అసూయలను మీ స్నేహితులూ, బంధువులూ గుర్తించలేరని భావించటం మీ అవివేకం. ఏదైనా సాధింటం ద్వారా ఈర్ష్య, అసూయలను అధిగమించవచ్చు. లేదా సాధించిన వారిని అభినందించి హృదయ పూర్వకంగా “శుభాకాంక్షలు” చెప్పటం ద్వారా ఈర్ష్య, అసూయలు దూరమవుతాయి. “శుభాకాంక్షలు” చెప్పే సంస్కారం వలన వైరభావాలు, నిర్లక్ష్యం లాంటివి ఏపుగా పెరగకుండా నిరోధింపబడతాయి.

మన సెల్‌ఫోన్‌లో కాంటాక్ట్ లిస్ట్‌లో ఉన్న వారందరికీ హృదయ పూర్వకంగా “శుభాకాంక్షలు” చెప్పగలగాలి. మన బంధువులందరికీ శుభాకాంక్షలు చెప్పగలగాలి. ఇంకా మిత్రులు, శ్రేయోభిలాషులు, ఆత్మీయులు, పరిచయస్థులు ఇరుగు-పొరుగు అందరికీ హృదయ పూర్వకంగా శుభాకాంక్షలు చెప్పాలి. ఫోన్ చేసి పలకరించి పనిగట్టుకుని చెప్పనవసరం లేదు. మనస్సులో చెబితే చాలు. అందరికీ మనసులో

చెప్పేసి సరిపెట్టటం సరైన పద్ధతి కాదు. కొందరికి విధిగా ఫోన్ చేసి, మరికొంతమందికి తరచూ కలిసి శుభాకాంక్షలు చెప్పాలి. లేదా అపురూపమైన పండుగరోజు అందరికీ ఫోన్ చేసి శుభాకంక్షలు చెప్పండి.

పరస్పర సహకారమే అభివృద్ధికి మూలం. ఈ భూమ్మీద నివశించే మనషులంతా ఒక కుటుంబంగా జీవించాలని మన పూర్వికులు పరిచయం చేసిన "శుభాకాంక్షలు" సాంప్రదాయం పండుగలకూ పబ్బాలకూ ముఖాన అరంగుళం నవ్వు పులుముకుని యాంత్రికంగా చెప్పే అవశేషంగా తయారైంది. అందువలనే వసుధైక కుటుంబం అనేది కలగా మిగిలిపోయింది.

ఇప్పుడు నేను చెబుతున్న "శుభాకాంక్షలు" కాన్సెప్ట్‌ను విశ్వసించి ఆచరించండి. డబ్బు ఖర్చు లేదుగదా! కేవలం పక్షం రోజులు అంటే 15 రోజులపాటు నూటికి నూరుశాతం "శుభాకాంక్షలు" సూత్రం అనుసరించండి. 15 రోజుల తర్వాత మీలో వచ్చిన మార్పు ఎదుటి వ్యక్తులకు తెలియకపోయినా మీకు స్పష్టంగా తెలుస్తుంది. మీకు డబ్బు కావాలి. అదెలా వస్తుందో విశ్వమే మీకు స్ఫురణ రూపంలో మీకు అందిస్తుంది. ఆరోగ్యం కావాలి. మీకు శారీరకంగానే కాదు మానసికంగా కూడా సంతోషంగా ఉంటారు. బంధువులు, ఆత్మీయులతో సంబంధ బాంధ్యవ్యాలు బాగుంటాయి. ఒక ముక్కలో చెప్పాలంటే మీరేం కోరితే అది లభిస్తుంది. మీ బుద్ధి పాదరసంలా పనిచేస్తుంది. మీ తెలివి ఇంద్ర ధనుస్సులా ప్రకాశిస్తుంది. మీ ముఖంలోనే మీకు అర్థం గాని ఒక దివ్య తేజస్సు ప్రవేశిస్తుంది. అలజడి, చిరాకు, ఆందోళన, వత్తిడి కనుచూపుమేరలో కానరావు. ఈ భూమ్మీద జీవించినంతకాలం దేనికీ కొరతగా భావించరు. మీరు చేయవలసిందల్లా అందరికీ

హృదయపూర్వకంగా "శుభాకాంక్షలు" చెప్పటమే! సర్వేజనా సుఖినోభవంతు అసలు అర్థం ఆంతర్యం ఇదే!

వినటానికి సులభంగా కనిపిస్తుంది గాని, శుభాకాంక్షలు చెప్పటాన్ని దీక్షగా తీసుకున్న దగ్గర్నుండి ఇందులో ఉన్న మతలబు ఏమిటో మీకే స్వయంగా అర్ధమవుతుంది.

ఇక మీదట మీరు ఎవ్వరినీ ప్రత్యక్షంగా గానీ, మనసులోగాని నిందించకూడదు. ఎలాంటి లావాదేవీల సంధర్భంలోనైనా ఎదుటి వ్యక్తిమీద వైరభావం ప్రదర్శించకూడదు. డాబుసరి మాట ఒక్కటికూడా మీ నోటి వెంట రాకూడదు. గర్వం, అహంకారం ఏమాత్రం తొంగి చూడకూడదు. ఎందుకంటే ఇవి ఉంటే మీరు హృదయపూర్వకంగా ఎదుటివ్యక్తులకు శుభాకాంక్షలు చెప్పలేరు. ఈ పరీక్షలో మీకెవ్వరూ ఇన్విజిలేటర్ ఉండరు.

దైనందిన జీవితంలో ఇప్పటివరకూ మీరు ఒక్కలా జీవించారు. ఈ రోజు నుండి కొత్తగా ఒక అభ్యాసం ప్రారంభించబోతున్నారు. సూక్ష్మ రూపంలో ఉండే మన ప్రతికూల ఆలోచనలు మనకు స్థూల రూపంలో రోగాలుగా సంక్రమిస్తున్నాయని పెద్దలు ఏనాడో చెప్పారు. మీరు కోరిన ఆరోగ్యం మీ స్వంతమవుతుంది. దీనికోసం మీరేమిచేయాలో విశ్వం మీకు స్ఫురణ కలుగజేస్తుంది. ఇంకా డబ్బు, కీర్తి, పదవి, ప్రజాదరణ, శాంతి.... ఒక్కటేమిటి? అన్నీ సులభసాధ్యమవుతాయి. చిరకాలంగా మీరు ఎదురు చూస్తున్న శుభకార్యం ఒకటి మీ ఇంట్లో జరుగుతుంది. తప్పిపోయిన మీ పాతమిత్రుడు మరలా మీకు తారస పడతాడు. అయిన వాళ్లతో మీకు పొరపొచ్చాలు తొలగిపోతాయి. కొండంత ఆత్మస్థైర్యం అభివృద్ధి చెందుతుంది. పిల్లలు బాగుంటారు. పరిసరాలు బాగుంటాయి. అంతా సజావుగా సాగిపోతుంది. అవసరాలెన్నో. ఔషధం ఒక్కటే. అదే

శుభాకాంక్షలు. ఈ శుభాకాంక్షలు చెప్పటం మీ కుటుంబసభ్యులనుండి ప్రారంభించండి.

ఈ రోజు నుండి ఏ ఒక్కరినీ మనసులోకూడా గడ్డిపోచంత విమర్శ చేయకుండా, సానునయంగా ఉండి హృదయపూర్వకంగా శుభాకాంక్షలు చెప్పండి. మనసులోనే సుమా!

కిరాణ షాపులో, బ్యాంకులో, రెస్టారెంటులో, విమానంలో, సినిమా హాలులో, ఇంట్లో, వీధిలో మీరెక్కడ ఉన్నా, ఎవరితో ఉన్నా, ఏ పనిలో ఉన్నా, ఎవరితో సంబాషిస్తున్నా, వారి శ్రేయస్సు కోరుతూ అందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు చెప్పండి. మీ పని పూర్తయితే అదే విధంగా కృతజ్ఞతలు చెప్పండి. ఇది మాత్రం బాహాటంగానే చెప్పండి. ఇలా 15 రోజులు చేయండి. ***"ఈ 15 రోజులు నేను ఎవ్వరినీ నిందించలేదు, ఎవ్వరినీ ద్వేషించలేదు, ఎవరిమీద అసూయపడలేదు, ఏ వ్యక్తితోనూ దాబుసరిగా మాట్లాడలేదు, నేను ఏ విధంగాను గొప్పవాడినని అనుకోలేదు"*** ఇలా గనుక మీకు మీరు 15 రోజుల తర్వాత చెప్పుకోగల్గితే మీ జీవితం అనూహ్యంగా మారిపోతుంది.

మీరు జీవితంలో పైకి రావటానికి, మీరు అనుకున్నది సాధించటానికీ మీరు అనేక విధాలుగా ప్రయత్నాలు చేసుంటారు. నా మాటయందు విశ్వాసముంచి ఒక పక్షం రోజులు అంటే 15 రోజులు ఈ శుభాకాంక్షలు మంత్ర జపం చేయండి.

ఒక ముఖ్య గమనిక.- మొదటిరోజు పూర్తవగానే రాత్రి పడుకోబోయేముందు..... ఆ రోజు ఉదయం లేచిన దగ్గర్నుండి జరిగిన సంఘటనలను, తారసపడిన వ్యక్తులను గుర్తు తెచ్చుకోండి. అందరికీ శుభాకాంక్షలు చెప్పారో లేదో పరీక్షించుకోండి. ఎక్కడైనా, ఎవరిమీదైనా

## శుభాకాంక్షలు

మనసులో కోపం పెట్టుకుని ఉంటే మీ పొరపాటును గుర్తించండి చాలు. అయ్యో పొరపాటు చేశానే..........అప్పుడలా ప్రవర్తించకుండా ఉండవలసిందని, మిమ్మల్ని మీరు సమీక్షించుకున్నంతనే విశ్వం మీరు చేసిన ఆ తప్పును క్షమిస్తుంది. ఈ విధంగా ప్రారంభంలో పొరబాట్లు జరిగినా నాలుగు రోజుల్లో అంతా సర్దుకుపోతుంది. మీరు తప్పకుండా మీ ప్రయత్నంలో విజయం సాధిస్తారు. మీకు నా హృదయపూర్వక శుభాకంక్షలు మరొక్కసారి తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

# విమర్శ

విమర్శ చెడ్డదైనా సద్విమర్శ మంచిదని మనందరం ఇప్పటివరకు సమాజం నుండి గ్రహించాం. ఎప్పుడో ఒక సమయంలో ఎవరో ఒకరు ఏది సమంజసమైనది, ఏది అనుచితమైనది అనే విశ్లేషణ చేయకపోతే, సమాజంలో మంచి భావాలు ఎలా వ్యాప్తి చెందుతాయి? ఈనాడు మీ అందరికీ నేను మనవి చేసేది ఏమంటే "విమర్శ" చెడ్డది, మళ్లీ సద్విమర్శ అని దీనికి సవరణ చేసి "విమర్శ"నే మనం రంగువేసి ఆమోదిస్తున్నాం. ఎవరైనా ధూర్త లక్షణాలున్న వాడిని మనం " వెధవ " అని అంటాం. సత్‌వెధవ అనే పద ప్రయోగం ఎక్కడైనా ఉందా? అంటే ఎధవ ఎధవే! మళ్లీ అందులో సత్‌వెధవ ఉండడు కదా! ఆ విధంగానే విమర్శ చెడ్డది. అది ఎన్ని రంగులేసుకున్నా మంచిదెలా అవుతుంది? సద్విమర్శ అని మినాహాయింపు నివ్వటం వెధవను సద్వెధవ అని సవరణ చేయటం లాంటిదే! మరి ఈ " సద్విమర్శ " అనేది ఏ విధంగా పుట్టిందో కొంచెం ఏకాగ్రతతో ఆలోచిస్తే మనం సులభంగా గ్రహించగలం.

విమర్శ చేసిన వ్యక్తి మేధస్సు గలవాడయితే, తన భాషా చాతుర్యంతో, జన్మతో వచ్చిన వాదనా ప్రతిభతో, ఎదుటి వ్యక్తి అభిప్రాయాలను, అభిరుచులను, ఇష్టాలను యధాతధంగా ఆమోదించకుండా, గౌరవించకుండా ఖండించి విమర్శించి తన మీద అపప్రధ లేకుండా చేసుకోవాలని, మేధావి వర్గంవారు తమకోసం సృష్టికున్న మాటలగారడీకి ముద్దుపేరే ఈ సద్విమర్శ.

తమ తమ కర్మఫలాలు అనుభవించేందుకు వివిధ కాలాలలో జన్మ తీసుకుని, వారి వారి జీవన ప్రయాణం సాగిస్తున్న ఈ లోకంలో ఏ

ఇద్దరి మనోభావాలు, మానసిక పరిణితి ఒకేలా ఉండే అవకాశం ఎంత మాత్రం లేదు. రైలు ప్రయాణంలో తారసపడిన తోటి ప్రయాణికుల మాదిరిగా కార్యాకారణ సంబంధం వలన ఈ లోకంలో ఒకరికొకరం కలవటం అనివార్యంగా జరుగుతోంది. భావ వ్యక్తీకరణ మనుషులకు వరం కాబట్టి అది ఉపయోగించుకునే ప్రయత్నంలో ప్రతి వ్యక్తీ తన ఆలోచనలను, భావాలను సాటి మనుషులతో పంచుకుంటాడు. అలా వ్యక్తీకరించిన భావాలలో, ప్రతిభా పాటవాలలో అనేక లోపాలు ఉన్నాయని ఎదుటి వ్యక్తి భావించినప్పటికీ "విమర్శ" చేసి తన ఆధిఖ్యతను ప్రదర్శించకూడదు. అలా చేయటం వలన విమర్శించిన వ్యక్తి అవతలి వ్యక్తి మనస్సులో స్థానం కోల్పోయి తద్వారా తదుపరి కాలంలో వారి సేవా సహకారాలు పొందలేడు. అంతేగాక విమర్శించిన వ్యక్తి ఎదుటి వ్యక్తి మనోవ్యధకు కారణమవటం వలన కొంత పాపకర్మను పోగుచేసుకున్నవాడవుతాడు.

కొంచెం జాగ్రత్తగా పరిశీలించితే, ఇతరుల భావజాలంతో నిరంతరం వ్యతిరేక దిశలో స్పందించి విమర్శించటం అంటే, విమర్శించే ప్రతి వ్యక్తి నిరంతరం వైరభావాలతో ఉంటున్నాడని లేదా నివురుగప్పిన నిప్పులా అతనిలో వైరభావాలు దాగున్నాయని, అందవలనే తనను తాను "విమర్శ" కు సమాయత్తం చేసుకుంటున్నాడని మనందరం అంగీకరించి తీరాలి.

అయితే విమర్శ అనేది నిఘంటువులో నుండి తొలగించాలా, విమర్శ అనే దానికి భాషలో తావేలేదా, తప్పు చేసిన వారిని విమర్శించకూడదా అని అందరికీ సందేహం వస్తుంది.

ఎవరు ఎవరినైనా విమర్శ చేయకూడదు.

ఎప్పుడు పడితే అప్పుడు విమర్శ చేయకూడదు.

ఎక్కడ పడితే అక్కడ విమర్శించకూడదు.

ఉదాహరణకు ఒక వ్యక్తిని అతని తండ్రి విమర్శించవచ్చును. ఒక భార్యను భర్త విమర్శించవచ్చును. ఒక విద్యార్ధిని అతని టీచరు విమర్శించవచ్చును. ఒక శిష్యుడిని గురువు విమర్శించవచ్చును. కార్య కర్తలను పార్టీ అధ్యక్షుడు విమర్శించవచ్చును. జిల్లా కలెక్టర్లను ముఖ్యమంత్రి విమర్శించవచ్చును. మంత్రిహోదాలో ఉన్న వ్యక్తి సంబంధిత ఉన్నతాధికారిని గాక, చిన్న ఉద్యోగులను డైరెక్టుగా విమర్శించకూడదు.

ఇలా తమ అర్హతను బట్టి, స్థాయిని బట్టి సంధర్భోచితంగా అది కూడా హితవు కోరి మాత్రమే విమర్శించాలి. తమ ఆధిక్యతను ప్రదర్శించేందుకు విమర్శించటం చాలా చెడ్డ పని.

క్షుణ్ణంగా చెప్పాలంటే చిన్నవాళ్లను పెద్దవాళ్లు విమర్శించవచ్చును. ఎవరిని పడితే వారిని విమర్శించకూడదంటే, స్థాయిని మరచి అనుచితంగా ప్రవర్తించకూడదని భావం. భావ స్వాతంత్రం పేరుతో సోషల్ మీడియాలో సాధారణ పౌరులు ఉన్నత స్థానంలో ఉన్న వారిని విమర్శించటం ఫ్యాషన్ అయిపోయింది. ఎవరిని పడితే వారిని విమర్శించకూడదంటే, విమర్శించే వ్యక్తికి సదరు ఉన్నతస్థానంలో ఉన్న వ్యక్తిని విమర్శించే సాంఘీక, రాజకీయ, నైతిక అర్హత ఉన్నదీ లేనిదీ సరిచూసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. అర్హత ఉన్నప్పటికీ ఎక్కడపడితే అక్కడ విమర్శించకూడదు. కొడుకుని తండ్రి విమర్శించవచ్చని అనుకున్నాం. కాని అతని భార్యా పిల్లల ముందు విమర్శించే హక్కు తండ్రికి కూడా లేదు. ఆ విధంగానే ముఖ్యమంత్రి ఇతర మంత్రులను గాని, కలెక్టర్లను గాని విమర్శించే హక్కు

ఉన్నప్పటికీ, ఆ విమర్శ తన ఛాంబరులో మాత్రమే చేయవలసి ఉంటుంది. సాటి ఉద్యోగుల సమక్షంలో ఉన్నతాధికారులను విమర్శించటం, బహిరంగంగా ఆక్షేపించటం వలన, నలుగురిలో చులకనగావటమే గాక పరిపాలన మీద ప్రతికూల ప్రభావముంటుంది. అందుకే భగవద్గీతలో భావం కలుగగానే వ్యక్తీకరించకూడదని చెప్పబడింది.

మనం వెలుబుచ్చే అభిప్రాయాలు నిరంతరం మన సానుకూల దృక్పథం ప్రతిఫలించటం మనకు అన్ని విధాలా శ్రేయస్కరం. విమర్శ అనేది ప్రతికూల దృక్పథానికి సంబంధించిన భావ వ్యక్తీకరణ. మందు, సిగరెట్, జూదం విచారం లాగానే ఇదికూడా అంటే " విమర్శ" ఒక వ్యసనమే! సిగరెట్ నలుగురు మానేస్తుంటే నాలుగు వందలమంది కొత్తగా అలవాటు చేసుకుంటున్నారు. సామాజిక రుగ్మతలను సమూలంగా రూపుమాపాలంటే వందల సంవత్సరాలు పడుతుంది. ఇలా నేను ప్రయత్న చేయటం విశ్వం నిర్ణయించే పరిణామక్రమంలో భాగంగా భావించాలి.

" విమర్శించటం" అనే వ్యసనాన్ని ఎవరికి వారే కృషిచేసి వదిలించుకోవాలి. మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారాలనే నాలుగు అంతకరణాలను ఏ విధంగా ఉపయోగించుకుంటున్నారనే మీ దృక్పథమే మీరు ఆమోదకులైనా ప్రమోదకులా, చింతించే విమర్శకులా అనేది నిర్ణయిస్తుంది.

కావున హితులారా; విమర్శ అనేది విషంతో సమానం. విమర్శించిన వ్యక్తినీ, విమర్శ పొందిన వ్యక్తినీ ఇద్దరికీ అది హాని చేస్తుంది. సమాజం బాగుండాలంటే విమర్శ ఎవ్వరూ ఎక్కడా వాడకూడదు. సద్విమర్శ అనేది మేధావుల మాటల గారడి మాత్రమేనని సవినయంగా మనవి చేస్తున్నాను.

మనందరం సజావుగా జీవిస్తున్నామంటే, సమాజంలో అంతర్లీనంగా ఉన్న సాంఘీక కట్టుబాటే కారణం. విమర్శ అనే అంటువ్యాధి సమాజంలో ఎక్కువ గావటం వలన ఒకరిని ఒకరు అంగీకరించలేని తనం, తద్వారా ఎవరి పని వారు చేస్తున్న ప్రస్తుత సాంఘీక వ్యవస్థలో కట్టుబాట్లను దిక్కరించే సంస్కృతి వ్యాప్తిచెంది ఆ సమాజం క్షీణ దశకు చేరుకుంటుంది.

కావున హితులారా విమర్శకు దూరంగా ఉండండి. సద్విమర్శ అనే రంగు వేసుకున్నప్పటికీ అది చాలా చెడ్డది. మీ అందరికీ నా శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.



ANNIE BESANT

BORN : 1st OCTOBER 1847
CLAPHAM, LONDON, UK

DIED : 20th SEPTEMBER 1933 (Aged 85)
ADYAR, MADRAS PRESIDENCY,
BRITISH ZINDIA

# అవినీతిపరులకు శుభవార్త

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి **శ్రీ నారా చంద్రబాబు నాయుడు** గారికి,

## ఈ పుస్తక రచయితగా నా విజ్ఞప్తి

**అయ్యా,**

ప్రభుత్వ అధికారులలో పట్టుబడని అవినీతి ఉద్యోగులు ఇంకా చాలామంది ఉన్నారని, సాక్ష్యాలు సేకరించటం ఇంకా పూర్తి కానందున వారిని ఇంకా అరెస్టు చేయలేదని తెలిసింది. అవినీతి పరులైన ఉద్యోగులు లేదా రాజకీయ నాయకులు స్వచ్ఛందంగా (తమకు తాముగా) అవినీతి సొమ్మును అప్పగించినట్లయితే, వారికి శిక్షలనుండి వెసులుబాటు కల్పించటమే గాక వారి వివరములు గోప్యంగా ఉంచి, వారు సరెండర్ చేసిన సొమ్మునుండి కొంతశాతం రివార్డుగా ప్రకటించిన యెడల మనకు, మన రాష్ట్రానికి పలు విధాలుగా ప్రయోజనం చేకూరుతుందని నా మనవి.

★ ముఖ్య మంత్రి గారికి ఎనలేని కీర్తి, గౌరవం దక్కుతాయి. ఈ క్షమ, ఔదార్యం వలన ప్రజలు మరలా మిమ్మల్నే మళ్లీ 2019 లో ముఖ్యమంత్రిగా అంగీకరించి గెలిపించే అవకాశం ఉంది.

★ అవినీతి ఉద్యోగులు వారంతట వారే సరెండర్ అవ్వటం వలన అవినీతి నిరోదక శాఖ వారికి అనవసర కాలయాపన జరగకుండా పని సులభతరమవుతుంది.

★ తమంత తాము అవినీతి సొమ్మును డిక్లేర్ చేయటం వలన కోర్టులో వారి అవినీతిని ఋజువు చేయటం, వాద ప్రతివాదాలు, డిఫెన్సు ప్రభుత్వానికి తలనొప్పి తగ్గుతుంది.

★ ప్రభుత్వానికి ఆకస్మిక ఆదాయం, తద్వారా పేదవారి సంక్షేమనిమిత్తం చేసే కార్యక్రమాలు మరింత వేగంగా, నిరాటంకంగా జరుగుతాయి.

★ అన్నింటికన్నా ముఖ్యంగా అవినీతిపరులకు క్షమాపణ దొరికి వారు నిజాయితీ పరులుగా మారే ఒక బృహత్తర అవకాశం వారికి లభిస్తుంది. వారు సరెండర్ చేసిన సొమ్ము ప్రభుత్వానికి అందజేయటం వలన, ఒక రకంగా ప్రజలకు అందజేసినట్లే! ఇది సత్కర్మ మరియు ఉత్తమ ప్రాయశ్చిత్త కర్మ. ఆ విధంగా అవినీతి పరులందరికీ పాప కర్మల నుండి విముక్తి లభించి వారి కుటుంబీకులకు మేలు చేకూరుతుంది.

ఉండవల్లి సెంటర్ ఇట్లు

01–10–2017 **చండిక సాంబశివరావు**

# CHANDIKA WORLD YouTube CHANNEL

# చండిక వరల్డ్ యుట్యూబ్ చానల్

అవినీతి పరులకు శుభవార్త వీడియోగా రూపొందించి చండిక వరల్డ్, యూట్యూబ్ చానల్ లో ఉంచటం జరిగింది. దీనితోపాటు కర్మ సిద్ధాంతం గురించి సులభంగా అర్ధమయ్యేందుకు పలు వీడియోలు ఉన్నాయి. ఆసక్తి గలవారు వీటిని చూడవచ్చును.

నా విద్యార్హతలు, అనుభవం, నేపథ్యం తదితర సంపూర్ణ వివరాలు గురించి తెలుసుకోదలచినవారు www.chandikaworld.com పరిశీలించవచ్చును.


ఉండవల్లి సెంటర్
01-10-2017

ఇట్లు
చండిక సాంబశివరావు

# అవినీతి పరులకు శుభవార్త

అవినీతిపరులకు ఇది నిజంగా శుభవార్తే, అయితే ఈ పుస్తకం చివరి వరకు చదివితేగాని ఈ విషయం అర్థంకాదు. అలాగని ఈ పుస్తకం టైటిల్ లేదా ఇందులో చెప్పబడిన అంశాలు మిస్‌గైడ్ చేసేవి కాదని, గైడ్ చేసే కీలక విషయాలు మాత్రమే ఉన్నాయని పాఠకులకు మనవి చేస్తున్నాను. గత 30 సంవత్సరాలుగా జ్యోతిషం, కర్మ సిద్ధాంతం అధ్యయనం చేశాను. ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి నిరుత్సాహ పడకుండా, లౌకిక జీవితంలో అభివృద్ధికి ఉపయోగపడ నప్పటికీ వ్యక్తిగత ఆసక్తిమేరకు ఈ అధ్యయనాన్ని ఇప్పటి వరకు కొనసాగిస్తూనే ఉన్నాను. ప్రయోగంతో గూడిన అధ్యయనం కాబట్టి కొన్ని ఫలితాలు వచ్చాయి. ఈ ఫలితాలను కూడా ఎంతో ఓర్పుగా పరిశీలించటం జరిగింది. ఈ పరిశీలన గంటలు, రోజులు గాక ఏళ్ల తరబడి చేశాను. ఆ విధంగా అనేక పరీక్షలకు రాటుదేలి నిలబడిన నికర ఫలితాలను మాత్రమే నేడు నల్గురికీ పుస్తకాల ద్వారా వీడియోల ద్వారా చెప్పటం ప్రారంభించాను.

జ్యోతిషరత్న
**చండిక సాంబశివరావు**
M.A. Litt., M.A. Astrology



**NIYA AND NIHAL PUBLICATIONS**